

ఎర్రగడ్డ జాతీయ రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు





ఒకే రోడ్డు నుంచి ఇరువైపులా ట్రాఫిక్‌ను మళ్ళించిన ట్రాఫిక్ అధికారులు



ఖైరతాబాద్ ప్రభుత్వ ముద్రణాలయం వద్ద వర్షం నీరు

అకాల వర్షం..

- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు
- వాహనాలను మళ్లించిన ట్రాఫిక్ పోలీసులు

ఖైరతాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా వచ్చిన ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈదురుగాలులకు రోడ్లపై కొన్ని చెట్లు నేలకొరగగా కొన్ని చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఖైరతాబాద్ రాజీవ్ చౌరస్తా, లక్డీకాపూల్ లక్కీ హోటల్ చౌరస్తా హోమ్‌సైన్స్ కళాశాల ముందు భాగం, మింట్ కాంపౌండ్, ఖైరతాబాద్ ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట, లక్డీకాపూల్ రహదారుల్లో తీవ్ర ట్రాఫిక్ జాం నెలకొంది. కొత్తగా నిర్మించిన సచివాల యం ఎదురుగా ఉన్న బస్టాపు వద్ద వర్షంనీరు చేరడంతో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపై నిలబడాల్సిన వచ్చింది.

ఎర్రగడ్డ: ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ఎర్రగడ్డ జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. అమీర్‌పేట, ఎస్సార్ నగర్, ఎర్రగడ్డ నుంచి మూసాపేట వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఎర్రగడ్డ ఈఎస్ఐ బస్టాప్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఎటూ వెళ్లలేని స్థితిలో గంటల తరబడి అక్కడే నిలిచిపోయారు. మూసాపేట నుంచి అమీర్‌పేట వైపు వెళ్లే రోడ్డులోని అమీర్‌పేట్ నుంచి మూసాపేట వైపు వెళ్లే వాహనాలను కూడా ఎర్రగడ్డ రైతు బజార్ వరకు మళ్లించారు. మూసాపేట వైపు వెళ్లే వాహనాలను ఎర్రగడ్డ ఛాతివాధుల ఆస్పత్రి నుంచి కుడి వైపునకు మళ్లించి ఈఎస్ఐ ఆస్పత్రి సెయింట్ థెరిసా ఆస్పత్రి వైపు రెండు వైపులా వెళ్లే వాహనాలను ఒకే రోడ్డు ద్వారా మళ్లించారు. రైతు బజార్ నుంచి తిరిగి యధాతథంగా వాహనాలను మళ్ళించారు. దాంతో ట్రాఫిక్ ఇబ్బందులు కొంతమేరకు తగ్గాయి.



సచివాలయం ఎదురుగా ఉన్న బస్టాపు వద్ద నిలిచిన వర్షపు నీరు

వర్షంతో కేటీఆర్ రోడ్‌షో రద్దు

ఖైరతాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఖైరతాబాద్‌లో జరగాల్సిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ రోడ్ షో రద్దు అయ్యింది. ఖైరతాబాద్‌లో పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంతో రోడ్‌షోను రద్దు చేసినట్టు బీఆర్ఎస్ నాయకులు గజ్జెల ఆనంద్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి తిలక్‌నగర్ అనంతరం ఖైరతాబాద్ బడా గణేష్, ఫిలింనగర్‌లో కెటీఆర్ రోడ్‌షోలు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపినా వర్షంతో రద్దు అయ్యాయి.

బీఆర్ఎస్ విజయం ఖాయం

- సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



బన్సీలాల్‌పేట్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, నిర్వహించిన సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, జీవై.కంపౌండ్, బోయగూడ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాల పట్ల ప్రజలు ఏవగించుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు అనుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ద్వారా ప్రజలకు కలిగిన లాభమే లేదని విమర్శించారు. ఎంపీగా పద్మారావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి'

బౌద్ధనగర్: బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ యువ నాయకుడు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చిలకలగూడ: పార్లమెంట్‌లో తెలంగాణ బాణి వినిపించాలంటే కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని ఆయిల్ డిపో, రైల్వే క్వార్టర్స్ తదితదిర ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 6వ డివిజన్ కార్పొరేటర్ మమతాప్రవీణ్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే చేవెళ్ల నియోజకవర్గం పాల్గుట్ట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చేరగా, వారికి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందని, దేశం మొత్తం మోదీ హవా నడుస్తోందన్నారు. రాష్ట్రంలోనూ భారతీయ జనతా పార్టీ 12 నుంచి 15 స్థానాల్లో విజయం సాధించనుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆశాభవం వ్యక్తం చేశారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతోనే తాను చేవెళ్లలో రెండు లక్షల పైచిలుకు ఓట్లతో విజయం సాధించబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మీర్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు పెండ్యాల నరసింహ, బడంగ్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు నీలా రవి నాయక్, శ్రవణ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీపీపై బీజేపీ నేతల ఫిర్యాదు



బోరబండ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు


యూసుఫ్‌గూడ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రచారం చేసుకునేవారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడమేమిటని ఫిర్యాదు చేసేందుకు కలిస్తే అసభ్య పదజాలంతో తిడుతూ బలవంతంగా వెళ్ల కొట్టాడని బీజేపీ నేతలు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళ్తే.. మంగళవారం ఉదయం స్థానిక బీజేపీ నాయకులు బోరబండ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తుండగా, అనుమతులు లేకుండా ప్రచారం చేస్తున్నారని బోరబండ పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అదే సమయంలో వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ కోసం బోరబండ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. డీసీపీ కనిపించగానే బీజేపీ నేతలు జరిగిన విషయం చెప్పేందుకు ఆయన వద్దకు వెళ్లి గుమ్మిగూడారు. దీంతో డీసీపీ విజయ్‌కుమార్ మీరంతా ఎవరూ ఇది పోలీస్ స్టేషన్ అనుకుంటున్నారా.. సంత అనుకుంటున్నారా.. అంటూ వీరిని బయటకు పంపాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపించారు. పోలీసులు గొంతు పట్టుకుని నెట్టారని తనకు దెబ్బ తగిలిందని కొత్త వెంకటేష్ ఆరోపించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ నేతలు డాక్టర్ పద్మ వీరపనేని, వర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు తదితర నేతలు బోరబండ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం డీసీపీ, తమపై అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుని ఎన్నికల విధులను దూరంగా ఉంచాలంటూ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని వారు అన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అవగాహనతోనే ఆస్తమా దూరం

ఎర్రగడ్డ, మే 7 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఆస్తమా వ్యాధిని దూరం పెట్టవచ్చని రాష్ట్ర వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ వాణి అన్నారు. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతి వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి ఎస్సార్ నగర్ మీదుగా ఆస్తమా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ.. 45సంవత్సరాల వయసు దాటిన 50 శాతం మంది భారతీయులు అనారోగ్యకరమైన ఊపిరితిత్తులు ఉన్నట్టు పరిశోధనల్లో తేలిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆస్తమా బాధితులు ఉన్నారని తెలిపారు. దగ్గు, ఆయాసం, పడుకున్నప్పుడు పిల్లికూతలు రావడం తదితర లక్షణాలు ఆస్తమా వ్యాధి లక్షణాలని ఆయన తెలిపారు. ఆస్తమాను సకాలంలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ నరేంద్ర, ఇతర వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



- త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరతూ మంగళవారం యూసుఫ్‌గూడలోని రాష్ట్ర బీసీ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, నవీన్‌యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న - యూసుఫ్‌గూడ, మే 7(ఆంధ్రజ్యోతి)



- బోరబండ రాజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కార్పొరేటర్ బాబా ఫస్సీయుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజ్‌నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీ అధ్యక్షుడు జైభీమ్ యాదగిరి, సభ్యులు శ్రీకాంత్, నందాగౌడ్, చారి, సాయి, ఓంకార్ పాల్గొన్నారు. - యూసుఫ్‌గూడ, మే 7(ఆంధ్రజ్యోతి)

దళారుల చేతుల్లో విషపూరితంగా మామిడి పండ్లు

- వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు

పంజాగుట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి రసాయనాలను ఉపయోగించి మగ్గపెడుతున్న మామిడి పండ్లు, ఇతర పండ్లు తినడం అత్యంత ప్రమాదకరమని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. వేసవిలో మామిడి పండ్లను చాలామంది ఇష్టంగా తింటారని అన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల ప్రకారం 10 కిలోల మామిడిపండ్లకు ఒక ప్యాకెట్ ఎథోమైన్ వాడాల్సి ఉండగా పది ప్యాకెట్లను వేసి మగ్గ పెడుతున్నారని అన్నారు. బాటసింగారంలోని పండ్ల మార్కెటులో కమిషన్ ఏజెంట్లు, ట్రేడర్స్ కలిసి ప్రమాణాలు పాటించకుండా మోతాదుకు మించి ఈ రసాయనాలు వినియోగిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈవిషయాన్ని మార్కెట్ అధికారులు, కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాడని బాటసింగారం మార్కెటుకు వెళ్తే దళారులు తమను అడ్డుకుని, దాడి చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఎఫ్ఎస్ఎస్ ఏఐకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. రైతు పండించిన నాణ్యమైన పండ్లు మార్కెట్లో దళారుల చేతుల్లో విషపూరితంగా మారుస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న చెక్ పోస్టు వద్ద అధికారులు తనిఖీ లు చేసి వాటి రవాణాను అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు రమేష్, సంజయ్ పాల్గొన్నారు.

సీబీఐ అధికారులమంటూ రూ. 91.64 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ. 91.64లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్సిల్ అడ్రస్ సరిగా లేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు. అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4 కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66..88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు. మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు. అందు కోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ. 91.64లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్చాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పట్టుబడిన దొంగ

యూసుఫ్‌గూడ, మే 7(ఆంధ్రజ్యోతి): రాత్రి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన అగంతకుడిని పోలీసులు పట్టుకున్నారు. దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధురానగర్ వెల్లంకి ఫుడ్స్ సమీపంలో నివసించే ఎన్.అశోక్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల 6న రాత్రి 11.30 గంటల సమయంలో వారి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఇది గమనించిన అశోక్ భార్య కేకలు వేయడంతో అతను పారిపోయి పక్కింట్లోకి చొరబడ్డారు. అశోక్ వెంటనే 100డయల్ చేశాడు. అంతే కాకుండ పక్కింటి ప్రసాద్ బాబుకు విషయం చెప్పాడు. దీంతో అంతా అప్రమత్తమై దొంగ ను గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దొంగను పట్టుకుని అతను దొంగిలించిన ఫోన్, ల్యాప్‌టాప్, చైన్, రూ. 720, వెండి గిన్నె సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నిద్ర లేచేసరికి బంగారం మాయం

యూసుఫ్‌గూడ, మే 7(ఆంధ్రజ్యోతి): నిద్రపోయి లేచే సరికి సెల్ఫ్‌లో పెట్టిన బంగారు మంగళసూత్రంతో పాటు రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురానగర్ అభయాంజనేయస్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉండే కె.పార్వతి హౌస్ కీపర్. ఈ నెల 6న రాత్రి తన మంగళసూత్రం తీసి సెల్ఫ్‌లో పెట్టి నిద్రపోయింది. గాలి రావడం లేదని తలుపు తెరచింది. అమె భర్త శివ బయట నిద్రపోయాడు. ఉదయం 5గంటలకు నిద్రలేచిన పార్వతికి తమ రెండు ఫోన్లు, సెల్ఫ్‌లో పెట్టిన 30 గ్రాముల మంగళ సూత్రం కనిపించలేదు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై హాస్టల్ నిర్వాహకుల దాడి

- స్నేహితుడిని హాస్టల్‌కు తేవడంపై ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువకుడు

అమీర్‌పేట, మే 7(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న యువకుడి కోసం వచ్చిన స్నేహితుడు ముఖం కడుక్కోవడం గ్రహించిన హాస్టల్ నిర్వాహకులు బూతులు తిట్టడంతోపాటు ఇద్దరిపై దాడిచేసిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పల్నాడు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన సయ్యద్ ఆసిఫ్, బీటెక్ పూర్తిచేసి నగరానికి వచ్చాడు. ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ బాలాజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. ఆదివారం ఆసిఫ్ స్వగ్రామం నుంచి అతడి స్నేహితుడు జహీర్ వచ్చాడు. జహీర్ స్నేహితుడితోపాటు హాస్టల్‌లోకి వెళ్లి ముఖం కడుకున్నాడు. అనంతరం బయటకు వస్తున్న సమయంలో హాస్టల్ నిర్వాహకుడు కొత్త వాళ్లను లోపలికి ఎందుకు తీసుకువచ్చావని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తల్లిని సంబోధిస్తూ తీవ్ర పదజాలంతో తిట్టాడు. తల్లిని ఎందుకు తిడుతున్నావని ఆసిఫ్ వారిని ప్రశ్నించాడు. దాంతో ఆగ్రహానికి లోనైన హాస్టల్ నిర్వాహకుడు, అతడి కుటుంబీకులు మూకుమ్మడిగా ఆసిఫ్‌పై దాడి చేశారు. నడిరోడ్డుపైకి తీసుకువచ్చి అందరి ముందు ఇద్దరు యువకులను చితకబాదారు. ఈ సంఘటన చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బాధితుడు ఆసిఫ్ తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

మోత్కుపల్లి.. కాదు ఉసరవెల్లి!

- కాంగ్రెస్ నాయకుడు శ్రీ శైలం

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తన ఇంటి పేరును 'ఉసరవెల్లి'గా మార్చుకుంటే పేరుకు తగినట్టు అర్థవంతంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.శ్రీశైలం వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లిపై శ్రీశైలం నిప్పులు చెరిగారు. ఇటీవలే శ్రీశైలం తెలంగాణ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్రంగా దుర్భాషలాడుతూ మోత్కుపల్లి ట్విట్టర్‌లో చేసిన పోస్టుపై శ్రీశైలం అభ్యంతరం వ్యక్తం చేశారు. మాదిగల హక్కుల కోసం మాట్లాడుతున్న మోత్కుపల్లి గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు. ఒక్క మాదిగ కైనా ఆయన మేలు చేశారా..? అని నిలదీశారు. మోత్కుపల్లి సీఎంపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాదిగలు మోత్కుపల్లిని కుల బహిష్కరణ చేస్తారని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలుచేసిన మోత్కుపల్లి నర్సింహులుపై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీశైలం కోరారు.


బండరాయితో బావ తలపై మోది హత్య

- భార్యాభర్తల మధ్య గొడవ
- సోదరి ఫిర్యాదుతో బావపై దాడి

అల్వాల్, మే 7 (ఆంధ్రజ్యోతి): బావమరిది బండరాయితో బావ తలపై మోది హత్య చేసిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగింది. అల్వాల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాహుల్ దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానకి(36) యుగేందర్(40) భార్యాభర్తలు. ఇటీవలే నగరానికి వచ్చి అల్వాల్‌లోని భారతీనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. యుగేందర్‌పై గతంలో ఆయా పోలీస్‌స్టేషన్‌లలో వివిధ నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యుగేందర్ కొన్ని రోజులుగా భార్య జానకిని మానసికంగా వేధిస్తున్నాడు. రోజురోజుకు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి మేడ్చల్ ప్రాంతంలో ఉండే తన సోదరుడు సుబ్రహ్మణ్యంకు జానకి ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో సుబ్రహ్మణ్యం వెంటనే అల్వాల్‌కు వచ్చి తన సోదరితో ఎందుకు గొడవ పడుతున్నావని బావ యుగేందర్‌తో గొడవకు దిగాడు.

ఇద్దరి మధ్య ఘర్షణ జరుగుతున్న నేపథ్యంలో సుబ్రహ్మణ్యం సమీపంలో ఉన్న బండరాయితో యుగేందర్ తలపై బలంగా కొట్టాడు. దీంతో యుగేందర్ తలకు తీవ్రమైన గాయలై అక్కడికక్కడే మరణించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. యుగేందర్ మరణానికి కారకులైన బావమరిది సుబ్రహ్మణ్యం, భార్య జానకిపై హత్య నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు సుబ్రహ్మణ్యం పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వేషన్లను ఎత్తేస్తే దేశం అగ్నిగుండమే



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రొ.హరగోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, జస్టిస్ చంద్రకుమార్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తదితరులు

బేగంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లను ఎత్తేస్తే దేశం అగ్నిగుండం అవుతుందని.. అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందకముందే రిజర్వేషన్లను ఎత్తేసి వారి అవకాశాల్ని హరించేలా చేస్తే ఊరుకోమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ప్రశ్నించారు. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అధ్యక్షతన 'రాజ్యాంగ రక్షణ - రిజర్వేషన్ల పరిరక్షణ'పై బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో మంగళవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, రాజ్యాంగ నిపుణులు జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ రాజనీతి విశ్లేషకులు ప్రొ.హరగోపాల్‌తో పాటు పలు జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకులు, విద్యార్థి నేతలు, రాజ్యాంగ నిపుణులు, ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రముఖ జర్నలిస్టు తులసి శ్రీమాన్ ఈ కార్యక్రమానికి సంధాన కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల ఎత్తివేత ఆరోపణలపై ప్రధాని స్పష్టత ఇవ్వాలన్నారు. రాజ్యాంగం ద్వారా సిద్ధించాల్సిన ఫలాలు నేటికీ బీసీలకు పూర్తి స్థాయిలో అందకుండానే రిజర్వేషన్లను ఎత్తేయడం అమానుష చర్య అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ బీజేపీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సమాజ్‌వాది పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బాల మల్లేష్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, సామాజిక వేత్త నారగోని, ప్రొఫెసర్ గాలి వినోద్, బీసీ రాజ్యాధికార సమితి మహిళా అధ్యక్షురాలు బోనం ఊర్మిళతో పలువురు ప్రసంగించారు.

ప్రియురాలి ఆత్మహత్య.. అదృశ్యమైన ప్రియుడు



సచిన్

గాజులరామారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి ఆత్మహత్య చేసుకోవడంతో ఆందోళన చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ ఆదర్శ నగర్‌కు చెందిన డి.సచిన్ సూరారంలోని ఓ ప్రైవేటు ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లిన సచిత్ తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి మనోహర్ సూరారం కాలనీలోని కార్యాలయం వద్దకు వెళ్లి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సచిన్ సహోద్యోగులు చెప్పిన వివరాల ప్రకారం కార్యాలయంలో ఓ యువతి, సచిన్ ప్రేమించుకున్నారు. ఈనెల 5న సచిన్ యువతి మధ్య పెళ్లి గురించి గొడవ పడ్డారు. తర్వాత ఇంటికి వెళ్లిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఆఫీసుకు వచ్చిన తర్వాత ఈ విషయం తెలియడంతో సచిన్ ఇంటికి వెళ్లలేదు. ప్రేమించిన యువతి చనిపోవడంతో భయపడిన సచిన్ అదృశ్యమయ్యాడని, అతడిని వెతికి పట్టుకోవాలని మనోహర్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల పిల్లలకు 'క్రెచ్'

- ప్రారంభించిన క్రెడాయ్ హైదరాబాద్

హైదరాబాద్ సిటీ, మే7 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు క్రెడాయ్ హైదరాబాద్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. క్రెడాయ్ కేర్స్ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పిల్లలకు పని ప్రదేశాల్లోనే ఆటవిడుపు కోసం క్రెచ్‌ను ఏర్పాటు చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని పరీరక్షించడానికి అనంత రిహాబ్‌తో కలిసి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయం తర్వాత అతి పెద్ద ఉపాధి కల్పన రంగంగా నిర్మాణ రంగం ఉందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు నగరంలో పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్.జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ.జగన్నాథరావులతో పాటు క్రెడాయ్ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

● మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల

కీసర, మే 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలుకానీ హామీలతో అధికారంలోకి వచ్చిందని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఈటల రాజేందర్ కీసరలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తిరిగి ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో మహిళలకు బ్యాంక్ అకౌంట్‌లో రూ.2500లు వేస్తానని, రైతులకు రుణమాఫీ చేస్తామని, విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని, రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మోసపూరితపు మాటలు చెప్పాడని ఈటల రాజేందర్ అన్నారు. ప్రజలు కాంగ్రెస్ చెప్పిన మోసపూరితపు మాటలను నమ్మకుండా వచ్చే 13వ తేదిన జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేయాలన్నారు. సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రోడ్ షో ముగిసేవరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, వెకట్‌రెడ్డి, నల్లా వెంకట్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.


రోడ్ షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఈటలకు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతు

మల్కాజిగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం తన మద్దతును ప్రకటించింది. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నారావు మంగళవారం మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అంకిత భావం కలిగిన ఈటలకు తమ సంఘం తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని, మా కళాకారులందరూ ఈటలకు అండగా నిలిచి ఆయన విజయానికి తమవంతు కృషిచేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్యాండ్ కళాకారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ హుస్సేన్, ప్రముఖ వాగ్గేయ కళాకారులు బీవీ మోహనకృష్ణ, సురేష్, నగేష్, లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాకతీయనగర్ పార్కులో ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సతీమణి కావ్య తదితరులు

ఈటలకు మద్దతుగా కిషన్‌రెడ్డి సతీమణి కావ్య ప్రచారం

రామంతాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, హబ్సిగూడ కాకతీయనగర్ పార్కులలో వాకర్స్‌ను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు టి.హనుమంతరావు కలిసి మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కమలం గుర్తుపై ఓటును వేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చంద్రమౌళి, యశ్వంత్, సోమ శ్రీనివాస్, అరవింద్, పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను మరిచిపోలేరు

● బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, నిర్వహించిన సంక్షేమ పథకాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, జీవై.కంపౌండ్, బోయగూడ తదితర ప్రాంతాల్లో స్థానిక శాసనసభ్యుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాల పట్ల ప్రజలు ఏవగించుకుంటున్నారని పద్మారావు పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలు ఈపాటికే నిర్ణయించుకున్నారని పద్మారావు అన్నారు.

తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి ద్వారా ప్రజలకు కలిగిన లాభమేమీ లేదని విమర్శించారు. ఎంపీగా పద్మారావు విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


బన్సీలాల్‌పేట్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు, తలసాని


పద్మారావుకు ఆప్యాయంగా షేక్ హ్యాండ్ ఇస్తున్న ప్రజలు

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ ఆపార్టీ యువనాయకుడు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం బౌద్ధనగర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చిలకలగూడ: పార్లమెంట్‌లో తెలంగాణ బాణి వినిపించాలంటే కారు గుర్తుకి ఓటు వేసి పద్మారావు గౌడ్‌ని గెలిపించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని ఆయిల్ డిపో, రైల్వే క్వార్టర్స్ తదితదిర ప్రాంతాలలో డివిజన్ అధ్యక్షుడు ఎ.ఆర్.కృష్ణ, కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం చేశారు.

కాంగ్రెస్, బీజేపీల పట్ల ప్రజలు విసుగుచెందారు

సికింద్రాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీల పట్ల ప్రజలు విసుగుచెందారని, తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారని మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్.లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత అన్నారు. కంటోన్మెంట్ 6వ వార్డులోని కౌసల్య ఎస్టేట్‌లో కంటోన్మెంట్ మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.


కౌసల్య ఎస్టేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆర్.లక్ష్మారెడ్డి, నివేదిత, పాండుయాదవ్


నివేదితను ఆప్యాయంగా ఆశీర్వదిస్తున్న ఓటరు

మారేడుపల్లి: కంటోన్మెంట్ నియోజకవర్గ 4వ వార్డులోని సుమన్ హౌసింగ్ కాలనీ, స్మార్ట్ కాలనీ, లలితా నగర్ కాలనీలలో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.నివేదిత, మాజీ బోర్డు మెంబర్ నళిని కిరణ్‌తో కలిసి చేపట్టిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఇంటింటికీ వెళ్ళి ఓటర్లను కలుస్తూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల మేనిఫెస్టోను వివరిస్తూ... ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి జి.నివేదిత ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.సంతోష్, గంగారాం, పి.శ్రీకాంత్, ఆనంద్, మురళి యాదవ్, రాజు యాదవ్, ఈశ్వరమ్మ, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చెల్లని రూపాయి శ్రీగణేష్ కాంగ్రెస్‌లో ఎలా చెల్లుతారు

● మర్రి రాజశేఖరరెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి

సికింద్రాబాద్, బోయినపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చెల్లని రూపాయిగా ఉన్న ఎన్.శ్రీగణేష్ కాంగ్రెస్ పార్టీలో ఎలా చెల్లుతారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలని మల్కాజిగిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రెండుసార్లు బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శ్రీగణేష్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుని, టిక్కెట్ ఇవ్వడం ద్వారా ప్రజా యుద్ధనౌక గద్దర్ కుటుంబాన్ని సైతం రేవంత్‌రెడ్డి అవమానించారని వారు ఆరోపించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు గద్దర్ కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగి, గద్దర్ కుమార్తె వెన్నెలకు కంటోన్మెంట్ టిక్కెట్ కేటాయించిన రేవంత్‌రెడ్డి తాజా ఎన్నికల్లో మొండి చెయ్యి చూపడం ద్వారా యావత్ మహిళాలోకాన్ని కూడా అవమానించారని వ్యాఖ్యానించారు. బోయినపల్లిలోని మర్రి రాజశేఖరరెడ్డి కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సాయన్న కుమార్తె నివేదితకు బీఆర్‌ఎస్ టిక్కెట్ కేటాయించి నిబద్ధత, నిజాయితీ, మానవత్వానికి మారుపేరుగా కేసీఆర్ నిలిచారని అన్నారు. జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బి.అనిత ప్రభాకర్, కె.పాండుయాదవ్, లోకనాథం, ఆకుల రూప, టి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ వీడియోల వెనుక ఎవరున్నా చర్యలు

● బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య

మారేడుపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అఘాయిత్యాలను ఎన్డీయే ఎప్పుడూ సహించదని, కర్నాటకలో ప్రజ్వల్ రేవన్న తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వీ సూర్య స్పష్టం చేశారు. శాంతిభద్రతల విషయంలో కర్నాటక ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని తేల్చి చెప్పారు. ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేంద్ర హిల్స్‌లో బీజేవైఎం అధికార ప్రతినిధి మల్క యశస్వి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేధావుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణలో బీజేపీ 15 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. అవినీతి. ఉగ్రవాద రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో మోడీ చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తుందని అన్నారు. కొంతమంది ఫేక్ వీడియోస్ తయారు చేసి బీజేపీని అభాసుపాలు చేయాలని చూస్తున్నారని, అలాంటి వారికి ఓట్ల రూపంలో ప్రజలే బుద్ధిచెపుతారని తెలిపారు. ఈ ఫేక్ వీడియోల వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి సురేష్‌త తదిరులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య

నిత్యం ప్రజల్లో ఉంటూ కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తా

● కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్

సికింద్రాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): నన్ను గెలిపిస్తే నిత్యం ప్రజల్లో ఉంటూ, కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్ హామీ ఇచ్చారు. మంగళవారం కంటోన్మెంట్ 3వ వార్డులోని బొలంరాయి, అంబేడ్కర్‌నగర్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శాసనసభ్యునిగా తనను, లోక్‌సభ సభ్యురాలిగా సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కంటోన్మెంట్‌లో మంచినీటి సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని చెప్పారు. అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు కృషి చేస్తానని, దీర్ఘ కాలిక ప్రాజెక్టులు చేపడతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున అభివృద్ధి మరింత సులభమవుతుందని పేర్కొన్నారు.


బొలంరాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీగణేష్


అంబేద్కర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీగణేష్

ప్రజలందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి

● సికింద్రాబాద్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలి
● మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి

బౌద్ధనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గంగాపురం కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి అన్నారు. మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కింది బస్తీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. సమర్థవంతమైన పాలన కోసం మూడోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డిని రెండోసారి గెలిపించాలన్నారు. బీజేపీకి అత్యధిక మెజార్టీ రావటానికి బూత్‌స్థాయి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభుగుప్తా, వినయ్, వీరేష్, పి.శ్రీనివాస్, రమేష్, ఎం.శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రచారం

సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం బౌద్ధనగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. సికింద్రాబాద్ ఇన్‌చార్జి తుమ్మల శివప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కమలం గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి సూరారం సుజాత, ముఖ్యనాయకులు నందారం సీతారాంమాదిగ, మామిడి మల్లేష్, విజయ్, మహేష్, మధు, వీరభద్ర పాల్గొన్నారు.


చిలకలగూడ క్రిందిబస్తీలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీమేయర్ బండ కార్తీకారెడ్డి


కిషన్‌రెడ్డికి మద్దతుగా న్యూఅశోక్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

9న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

బౌద్ధనగర్ : సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం తలపెట్టిన బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీరెల్లి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం వారాసిగూడలో సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్రకార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, రాజభూపాల్‌గౌడ్, విద్యాసాగర్, డివిజన్ అధ్యక్షులు హన్మంతుముదిరాజ్, అంబాలరాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు


ఇంటింటి ప్రచారంలో శ్రీనివాస్, చంద్రశేఖర రావు

అందరికీ అందుబాటులో ఉంటా.. గెలిపించండి

● మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి


మాట్లాడుతున్న మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, పక్కన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


చైతన్యపురి డివిజన్‌లో జరిగిన రోడ్ షోలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 7 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణను కేసీఆర్, హైదరాబాద్‌ను కేటీఆర్ అభివృద్ధి చేశారని, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలంటే రాబోయే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో పలు కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న తాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేశామని సిగ్గులేకుండా అబద్ధాలు ఆడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇస్తామన్న రూ.2500లు తులం బంగారం, వృద్ధులకు 4వేల పింఛను, రైతులకు 500బోనస్‌లు ఇవ్వలేదన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే తనని భారీ మెజార్టీతో గెలిపించాలనీ కోరారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాంకోటి, కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులుపాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటు వేసేలా కృషి చేయండి

నేరేడ్‌మెట్ : బీఆర్‌ఎస్‌కు ఓటు వేసేలా కార్యకర్తలందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల పోలింగ్ బూత్ లెవల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో కమలం గెలుపు ఖాయం

● కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశతిలక్

సికింద్రాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సుపరిపాలనను చూసిన ప్రజలు మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కమలం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించడం ఖాయమని కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశతిలక్ ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, కంటోన్మెంట్‌లో కూడా బీజేపీని గెలిపిస్తే శీఘ్రగతిన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

అన్ని కాలనీలు, బస్తీల ప్రజలు బీజేపీని గెలిపించాలని నిర్ణయించారని ఆయన చెప్పారు.

మిస్సింగ్ బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో రైలులో పోగొట్టుకున్న బ్యాగును తిరిగి ప్రయాణికుడికి అప్పగించామని హైద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న హుస్సేన్‌సాగర్ రైలులో ప్రయాణం చేసిన సింగ్‌రాథోడ్ అనే ప్రయాణికుడి బ్యాగు కనిపించడంలేదని తమకు ఫిర్యాదు చేయడంతో వెంటనే రైలులో అప్పటికప్పుడు కానిస్టేబుళ్లతో వాకబు చేయగా రైలులో బ్యాగు దొరికింది. వెంటనే బ్యాగును ప్రయాణికుడికి అప్పగించామని, అందులో ఐదు వేల విలువ చేసే దుస్తులు, ఇతర వస్తువులు ఉన్నాయని సీఐ తెలిపారు. రైలులో ప్రయాణం చేసే సమయంలో తమ లగేజీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని ప్రయాణికులను కోరారు.

ప్రయాణికుడి సెల్‌ఫోన్ అందజేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న ఖరీదైన సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆర్పీఎఫ్ పోలీసులు అప్పగించారు. సికింద్రాబాద్ డివిజన్ హైద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఆలుగడ్డబావి ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్‌రావు మంగళవారం బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో బాధితుడు బేగంపేట్ ఆర్పీఎఫ్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైల్వే స్టేషన్‌లో గాలించగా ఓ వ్యక్తి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.

సీబీఐ అధికారులమంటూ రూ.91.64లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ.91.64 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74 ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్శిల్ అడ్రస్ సరిగాలేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు.

అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66.88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు. మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు.

అందుకోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ.91.64 లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్పీఎఫ్ పోలీసుల చెంతకు బాలిక

● ప్రభుత్వ హోంకు తరలింపు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న మూడేళ్ల బాలికను సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీసి ప్రభుత్వం హోంకు తరలించారు. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై ఎంవీ.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబరు 1లోని గేటు నెంబరు 4 వద్ద మూడేళ్ల బాలిక సంక్రాంతన (3) ఏడుస్తూ ఉండగా, ఆ సమయంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్ రెడ్డితో పాటు మహిళా కానిస్టేబుళ్లు వైశాలి, టీవీఎన్.జ్యోతి బాలికను చూసి అక్కున చేర్చుకున్నారు. వెంటనే బాలిక తల్లిదండ్రుల కోసం వాకబు చేసినా ఫలితం లేకపోయింది. బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు అప్పగించారు.


బాలికను చేరదీసిన సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు


రైల్వే స్టేషన్‌లో మద్యం బాటిళ్లను పట్టుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వే స్టేషన్‌లో మద్యం బాటిళ్ల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై ఎంవి రెడ్డి తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్, జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్‌రెడ్డి, జీఆర్పీ ఎస్సై రమేష్, అశోక్ సింగ్‌లతో పాటు ఆర్పీఎఫ్, జీఆర్పీ కానిస్టేబుళ్లు తనిఖీలు చేస్తుండగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఒక బాక్సు కనిపించింది. తెరిచి చూడగా అందులో రూ.23,270వేల విలువ చేసే ఖరీదైన మద్యం బాటిళ్లు ఉన్నట్లు తెలుసుకుని వెంటనే మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారిణి సౌజన్యకు అప్పగించారు. మద్యం బాటిళ్లను తీసుకొచ్చిన వ్యక్తిపై ఆరా తీస్తున్నారు.